సాక్షి
మహబూబ్‌నగర్
మంగళవారం, 5, సెప్టెంబర్, 2023

గరిష్టం/కనిష్టం
32.6/21.7
వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.



## గురుదేవోభవ..

ఉపాధ్యాయ వృత్తి అంటే.. ఏదో నాలుగు పాఠాలు చెప్పామా.. వెళ్లామా.. అని కాకుండా కొంత మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఔరా అనిపించుకుంటున్నారు. చదువుతో పాటు క్రీడారంగాల్లో సైతం రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. వృత్తికి న్యాయం చేస్తూ.. పిల్లల ఉన్నతికి కృషి చేస్తూ అవార్డులు.. ప్రశంసలు పొందుతున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అలాంటి ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనాలు...

- వివరాలు 8లో..

## న్యూస్‌రీల్

### ఉత్తమ ఉపాధ్యాయులుగా 55 మంది ఎంపిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: **జిల్లావ్యాప్తంగా** వివిధ పాఠశాలల్లో పనిచేస్తు**న్న 55 మంది** ఉపాధ్యాయులను జిల్లా ఉ**త్తమ గురువులుగా** ఎంపిక చేశారు. ఇందులో గె**జిటెడ్ హెచ్‌ఎంలు** ఇద్దరు, స్కూల్ అసిస్టెంట్**లు 21, లాంగ్వేజ్** పండిట్‌లు ముగ్గురు, పీఈ**టీలు ముగ్గురు**, సెకండ్ గ్రేడ్ టీచర్‌లు 23, కేజీబీవీ సీఆర్టీ టీచర్లు ముగ్గురు ఉన్నారు. ఈ మేరకు ఎంపికైన వారికి మంగళవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2 గంటలకు అవార్డులను ప్రదానం చేయనున్నట్లు డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రవినాయక్, అధికారులు, పలువురు ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

### నేడు రాఖీపౌర్ణమి లక్కీ డ్రా

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని మహిళా ప్రయాణికులకు ఏర్పాటు చేసిన లక్కీడ్రా తీయనున్నట్లు రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రీజియన్‌లోని ప్రధాన బస్టాండ్లలో లక్కీడ్రా బాక్స్‌లు ఏర్పాటు చేయగా విశేష స్పందన లభించినట్లు తెలిపారు. లక్కీడ్రాలో ప్రథమ విజేతకు రూ.25 వేలు, ద్వితీయ రూ.15 వేలు, తృతీయ రూ.10 వేలు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. గెలుపొందిన వారికి హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్‌లో ఈనెల 8వ తేదీన నగదు బహుమతులు అందజేయడంతో పాటు ఘనంగా సత్కరిస్తారని పేర్కొన్నారు. రీజియన్‌లో జరిగే లక్కీడ్రా కార్యక్రమానికి సెరికల్చర్ డీడీ లత, డెయిరీ డీడీ కవిత, మత్స్యశాఖ ఏడీ రాధా రోహిణి, ఆరోగ్యశ్రీ డీసీ డాక్టర్ స్వప్న ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

### పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని బీపీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి, పోటీ ప్రపంచంలో నిలబడే విధంగా తయారు చేసినప్పుడు మాత్రమే వారికి మంచి జీవితాన్ని ఇచ్చినట్లు అవుతుందన్నారు. బదిలీలు, పదోన్నతులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని, సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. పీఆర్సీ కమిషన్ వేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో తపస్ నాయకులు సునీల్, గద్దం నాయుడు బాబు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: సికింద్రాబాద్‌లో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్–14, అండర్–17 ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గజానంద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం 9440765228, 9396439663 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### సర్టిఫికెట్ల పరిశీలన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా కేజీబీవీల్లో మిగిలిపోయిన పోస్టుల భర్తీ కోసం సోమవారం అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలనను కలెక్టరేట్‌లో నిర్వహించారు. 1:3 నిష్పత్తి ప్రకారం చొప్పున అభ్యర్థులను పరిశీలనకు పిలిచారు.

● 'కారు'లో కిరికిరి

# మక్తల్.. రెబెల్స్..!



షాద్‌నగర్ శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో సమావేశమైన అసమ్మతి నేతలు

- ఎమ్మెల్యే చిట్టెంపై అసమ్మతి జ్వాలలు
- షాద్‌నగర్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో అసంతృప్తుల భేటీ
- ఒకే వేదికపైకి వర్కటం, దేవర మల్లప్ప, బాలకృష్ణారెడ్డి తదితరులు
- 5 మండలాల నుంచి హాజరైన నాయకులు
- బీఆర్‌ఎస్ అభ్యర్థిని మార్చాలని డిమాండ్
- లేకుంటే సహకరించేది లేదని వెల్లడి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల ఖరారు తర్వాత పాలమూరులో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. అభ్యర్థులను మార్చాలంటూ రోజురోజుకూ అసమ్మతి స్వరాలు పెరుగుతుండడంతో వేడి రాజుకుంటోంది. తొలుత జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో అసంతృప్తి జాడలు వెలుగులోకి రాగా.. ఆ తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో బట్టబయలయ్యాయి. తాజాగా నారాయణపేట జిల్లా మక్తల్ సెగ్మెంట్‌లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా రెబల్స్ మూకుమ్మడిగా అసమ్మతి గళం వినిపించడం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది.

#### ఎటు దారితీస్తాయో..

ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. అన్ని సీట్లను సిట్టింగ్ ఎమ్మెల్యేలకే కేటాయిస్తూ బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రధానంగా కల్వకుర్తిలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌పై పెద్ద ఎత్తున వ్యతిరేకత పెల్లుబికగా.. అలంపూర్‌లో అక్కడక్కడ అసమ్మతి రాజుకుంది. వీటిపై దృష్టి సారించిన కేసీఆర్ నష్ట నివారణ చర్యలు చేపట్టారు. అసమ్మతి నేతలను బుజ్జగించేలా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు మంత్రి హరీశ్‌రావు, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కల్వకుర్తి అసమ్మతి నేతలతో వారు ఓ దఫా సంప్రదింపులు జరపగా.. త్వరలో అలంపూర్ నియోజకవర్గంలోని అసంతృప్త నేతలతో సమావేశానికి రంగం సిద్ధం చేశారు. ఈ తరుణంలో కొత్తగా మక్తల్ సెగ్మెంట్‌కు సంబంధించి అసమ్మతి కార్యకలాపాలు వెలుగుచూడడంతో ఈ పరిణామాలు ఎటుదారి తీస్తాయోననే ఆందోళన గులాబీ శ్రేణుల్లో నెలకొంది.



#### మక్తల్ బచావో అంటూ...

మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వొద్దంటూ అసమ్మతి నేతలు షాద్‌నగర్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో ఆదివారం అర్ధరాత్రి సమావేశమైనట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ నాయకుడు, వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవర మల్లప్ప, బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో ఐదు మండలాలకు చెందిన అసంతృప్తులు సుమారు 120మంది వరకు భేటీ అయినట్లు సమాచారం. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తప్ప.. మక్తల్‌లో ప్రత్యేకంగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని.. ఆయనకు టికెట్ ఇస్తే బీఆర్‌ఎస్ ఓడిపోతుందని.. ఆయనకు సహకరించేది లేదంటూ అసమ్మతి నేతలు ముక్తకంఠంతో తమతమ అభిప్రాయాలను వెల్లడించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఎమ్మెల్యే నిధులతో ఏయే ప్రాంతాలు అభివృద్ధి చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేయడంతో పాటు చిట్టెం హటావో.. మక్తల్ బచావో నినాదాలు చేసినట్లు సమాచారం.

#### ..లేదంటే కఠిన నిర్ణయమే..!

ఉమ్మడి జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోజురోజుకూ అసమ్మతి రాజుకుంటుండడంపై బీఆర్‌ఎస్ అధిష్టానం అసంతృప్తిగా ఉంది. మక్తల్‌లో ఇతర పార్టీల నేతలతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు అసమ్మతుల సమావేశం నిర్వహించడంపై ఫిర్యాదు అందినట్లు సమాచారం. మంత్రి హరీశ్‌రావు ద్వారా సీఎం కేసీఆర్ పూర్తిస్థాయిలో ఆరా తీసినట్లు వినికిడి. ఈ క్రమంలో అవసరమైతే కఠిన నిర్ణయం తీసుకుంటామనే హెచ్చరికలు పంపాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలుస్తోంది. అసమ్మతి నాయకులను బుజ్జగించడం చేస్తూనే పార్టీ గీత దాటే ఒకరిద్దరు నాయకులపై వేటు వేసేలా అధిష్టానం ముందుకు సాగుతున్నట్లు పార్టీకి చెందిన సీనియర్ నేతల్లో చర్చ జరుగుతోంది.

#### ఇతర పార్టీల నాయకులతో కలిసి..!

ఈ సమావేశంలో బీఆర్‌ఎస్‌కు చెందిన నర్వ మండలానికి చెందిన సింగిల్ విండో మాజీ చైర్మన్ బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, మక్తల్ మండలానికి చెందిన గోపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ రవికుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హనుమంతు, మాజీ సర్పంచ్ సూర్య నారాయణ గుప్త, ఉద్యమకారుడు నీలప్ప ముదిరాజ్, మాగనూర్ మండలానికి చెందిన మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, శివరామిరెడ్డి, ఒడ్వాటి రఘుతో పాటు ఉట్కూరు, కృష్ణా మండలాలకు చెందిన పలువురు పాల్గొన్నారు. అయితే కాంగ్రెస్‌కు చెందిన బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి, ఇదే పార్టీకి చెందిన మక్తల్ మండలం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మారెడ్డి, బీజేపీ నాయకుడు మక్తల్ మండలం చిట్యాల ఎంపీటీసీ సభ్యుడు రామలింగప్ప తదితరులు సమావేశంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఎమ్మెల్యే వ్యతిరేకులను ఏకతాటిపైకి తేవడంతో పాటు మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో భారీ ఎత్తున సమావేశం నిర్వహించేలా అసమ్మతి నేతలు ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

## పీయూ డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాల్లో చదువుతున్న సెమిస్టర్–6 రెగ్యులర్, 2, 4, 5 బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ సోమవారం విడుదల చేశారు. ఈ మేరకు 6వ సెమిస్టర్‌లో మొత్తం 12,833 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే, ఇందులో 7,187 మంది ఉత్తీర్ణత సాధించి 56 శాతం నమోదు చేశారు. 2వ సెమిస్టర్‌లో 12,591 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే 4,791 మంది పాసై 38 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. 4వ సెమిస్టర్‌లో 19,118 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే 7,415 మంది విద్యార్థులు పాసై 38.79శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. ఇక 5వ సెమిస్టర్‌లో 3,559 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే 2,164 మంది పాసై 59శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో జరిగే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించే విధంగా కళాశాల యాజమన్యాలు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ, కంట్రోలర్ రాజ్‌కుమార్, మధుసూదన్ రెడ్డి, నాగభూషణం, కిషోర్, చంద్రకిరణ్, శాంతి ప్రియ, అరుంధతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

#### రిజిస్ట్రార్ పదవీకాలం పొడిగింపు

పీయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న గిరిజ పదవీ కాలాన్ని పొడిగింపు ఇస్తూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత కాలం ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారని, భవిష్యత్‌లో మరింత ఉత్సాహంగా నిర్వహించాలని ఆయన సూచించారు.

## ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఈ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా, మండల స్థాయిలో ప్రజలు సమర్పించే ఫిర్యాదులకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేయాలని, పైస్థాయిలో పరిష్కారం అయ్యేలా ఉంటే తక్షణమే వాటిని పంపించాలన్నారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న వాటిని అప్‌లోడ్ చేయాలన్నారు. తహసీల్దార్లు ఓటరు జాబితా సవరణలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి, జెడ్పీ సీఈఓ జ్యోతి పాల్గొన్నారు.

#### రైతులందరికీ కొత్త రుణాల మంజూరు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రుణమాఫీ పొందిన రైతులందరికీ బ్యాంకర్లు కొత్త రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, ఎల్‌డీఎంలు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి తదితర ఉన్నతాధికారులతో కలిసి ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.1.10లక్షల వరకు పంట రుణాలు ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేశామన్నారు. అలాగే ఎస్‌పీసీబీ ఆధారంగా ఇతర బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న వారికి సంబంధించి కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి రుణమాఫీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త రుణాల మంజూరుపై జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించాలన్నారు. గృహలక్ష్మి పథకం కింద వారం, పదిరోజుల్లో లబ్ధిదారులకు ఉత్తర్వులు అందజేయాలన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ జి.రవినాయక్, రెవెన్యూ అడిషన్ కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య, డీఆర్‌డీఓ కె.వి.వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరంగా బీసీ ఆర్థిక సాయం: మంత్రి



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీల్లో అత్యంత పేదవారికి అందిస్తున్న ఆర్థికసాయం కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మినీ శిల్పారామంలో రెండో విడతలో భాగంగా 300 మంది బీసీలకు ఆర్థిక సాయానికి సంబంధించిన రూ.లక్ష చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఆర్థిక సాయం అందించాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక లబ్ధి పొందినవారేనని పేర్కొన్నారు. ఆసరా పెన్షన్ విద్యార్థులకు సన్న బియ్యం, గురుకులాల ఏర్పాటు, కల్యాణ లక్ష్మి, రైతు బంధు, రైతుబీమా, దళిత బంధు, కులవృత్తులకు ప్రోత్సాహం వంటివి ఇస్తున్నట్లు తెలిపారు. దశల వారీగా అందరికీ ఈ పథకాన్ని అమలు చేస్తామని, అగ్రవర్ణాలలోని పేదలకు కూడా ఈ పథకం అందజేస్తామన్నారు. పాలమూరు ఎత్తిపోతల డ్రైరన్ విజయవంతమైందని త్వరలోనే సాగునీటిని తీసుకొచ్చి నియోజకవర్గంలోని చెరువులను నింపుతామన్నారు. జిల్లాను పర్యటకంగా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని, 9 ఏళ్లలో జిల్లా రూపురేఖలు మారాయని తెలిపారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వెనుకబడిన తరగతుల కులాలకు ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా 900 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయగా.. నియోజకవర్గంలో మొదటివిడతగా 300, రెండో విడతలో 300 మందికి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, బీసీ సంక్షేమాధికారి ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యలు రాకుండా చర్యలు

మహబూబ్‌నగర్ క్రైం: దివిటిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో నిరంతరం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎస్పీ కె.నరసింహ ఆదేశాల మేరకు సోమవారం ఏఎస్పీ రాములుతో పాటు మూడు స్టేషన్ల పోలీసులు దివిటిపల్లి దగ్గర రోడ్డు పరిశీలించారు. మొదట ట్రాఫిక్ అంతరాయనికి గల కారణాల తెలుసుకుని, ట్రాఫిక్ సమస్య రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ రాములు మాట్లాడుతూ మూడు జడ్చర్ల, భూత్పూర్, మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 20మంది సిబ్బందితో క్విక్ రియాక్షన్ టీం ఏర్పాటు చేశామన్నారు. ఈ సిబ్బంది ట్రాఫిక్ అంతరాయం కలిగిందని తెలిస్తే తక్షణ చర్యలు తీసుకోవడానికి స్పాట్‌కు చేరుకుంటారని తెలిపారు. విద్యుత్ లైట్లు ఏర్పాటుతో పాటు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఇరువైపుల సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డుకు ఇరువైపులా స్టాఫర్స్ ఏర్పాటుతో పాటు, అనివార్య కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగితే వాహనాలు త్వరగా తొలగించడానికి క్రేన్, జేసీబీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, సీఐలు రమేష్ బాబు, రామకృష్ణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు, జాతీయ రహదారి అథారిటీ సిబ్బంది, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.



## రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారం

● టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్



జిల్లా కేంద్రంలోని ఓ దుకాణంలో కార్యక్రమం గురించి వివరిస్తున్న కాంగ్రెస్‌నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రానుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తిరగబడుదాం–తరిమికొడుదాం కార్యక్రమం నిర్వహించారు. మోటార్‌లైన్‌లో నాయకులు పాదయాత్ర చేపట్టి దుకాణాల్లో ప్రజలను కలిసి కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలపై ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెబుతారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమమే తమ పార్టీ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, సీజే బెనహర్, బెక్కరి అనిత, సిరాజ్ ఖాద్రీ, మధుసూదన్‌రెడ్డి, సాయిబాబా, లక్ష్మణ్ యాదవ్, ఫయాజ్, అజ్మత్‌అలీ, రమేశ్, అవేజ్, ఫహీం, చంద్రశేఖర్, నాగరాజు, జహీర్, శ్రీరాం, సల్మాన్ పాల్గొన్నారు.

## జిల్లాలో విస్తారంగా వర్షాలు



వర్నె వద్ద వాగులో తెగిపోయిన మట్టిరోడ్డు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం)/అడ్డాకుల: జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షం కురుస్తుండడంతో చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరుకుంటుంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు అడపాదడపా కురిసిన వర్షం వల్ల జనజీవనం స్తంభించింది. జిల్లాలో మరో మూడు రోజుల పాటు ద్రోణి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ ప్రభావంతో పంటలకు ప్రయోజనం ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.వెంకటేష్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా.. అడ్డాకుల మండలం వర్నె వాగుపై వేసిన రోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో వర్నె, ముత్యాలంపల్లి గ్రామాల ప్రజలు కొకుంట్ల, ఇప్రంపల్లి, రాచాల, పొన్నకల్, శాఖాపూర్ మీదుగా 15కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి అడ్డాకులకు రావాల్సి వస్తోంది. మూసాపేట, అడ్డాకుల మండలాల్లో వాగులో నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తిస్థాయిలో నిండి వరద నీళ్లు దిగువకు వెళ్తున్నాయి.

## ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి: ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే దరఖాస్తులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కె.నరసింహ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి వారితో మాట్లాడారు. మొత్తం పదిమంది బాధితులు వారి సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకురాగా.. ఆయా స్టేషన్ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించడం వల్ల పోలీసు శాఖపై ప్రజలకు మరింత పెరుగుతుందన్నారు.

# గురుదేవోభవ...

## చిన్నారుల ప్రయోగశాల

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ప్రయోగాత్మకంగా చూడాలని విద్యార్థులు కలలు కంటుంటారు. కొన్ని అంశాలు ప్రయోగాత్మకంగా చూస్తేనే అర్థమయ్యే పరిస్థితి ఉంటుంది. కానీ అన్ని పాఠశాలల్లో ల్యాబ్‌ల ఏర్పాటుకు అవకాశం లేదు. విద్యార్థుల కలల్ని నిజం చేసే దిశగా డ్రీంఫోర్స్ ఫౌండేషన్ కృషి చేస్తోంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉచిత సేవలందిస్తున్న ఏపీజే అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్‌పై ప్రత్యేక కథనం..

- డ్రీంఫోర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక సైన్స్ ల్యాబ్
- భౌతిక, రసాయన, జీవశాస్త్ర ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.12 లక్షల వ్యయం
- సెలవు రోజుల్లో నిర్వహణ.. విద్యార్థులు స్వతహాగా ప్రయోగాలు చేసే సదుపాయం


పాలమూరులో అబ్దుల్‌కలాం సైన్స్ ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న అబ్దుల్ కలాం సైన్స్‌ల్యాబ్ ప్రతి ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో విద్యార్థులతో సందడిగా కనిపిస్తుంది. సైన్స్‌పై ఆసక్తి ఉన్న ఉమ్మడి జిల్లా విద్యార్థులు ఒకేసారి 50 నుంచి 70 మంది వరకు వస్తుంటారు.

### ఉమ్మడి జిల్లాకేంద్రంలో..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత ప్రవేశం ఉంటుంది. ప్రయోగాలకు కావాల్సిన సామగ్రి, పరికరాలను నిర్వాహకులే ఉచితంగా అందిస్తారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారు. దీంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తాము చేయాలనుకున్న ప్రయోగాలను విద్యార్థులు పూర్తి చేసుకుంటారు.

### క్రమపద్ధతిలో..

ల్యాబ్‌కు వచ్చే ప్రతి విద్యార్థి తను చేయాలనుకున్న ప్రయోగానికి సంబంధించిన పుస్తకాన్ని చదవాల్సి ఉంటుంది. అనంతరం స్టేజీపై తన ప్రయోగం గురించి ఇతర విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించాలి. ప్రయోగానికి కావాల్సిన పరికరాలు, రసాయనాలు తదితరాల జాబితాను సిద్ధం చేసుకొని అప్పుడు ప్రయోగం ప్రారంభించాలి. ఏవైనా ఇబ్బందులు, సందేహాలు తలెత్తితే అక్కడే ఉండే ఉపాధ్యాయుడి సాయం తీసుకోవాలి. ప్రయోగం పూర్తయ్యాక ఫలితాలు, తాను అర్థం చేసుకున్న అంశాలు, లాభం, నష్టంతో నివేదిక రాసి ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కరుగా లేదా జట్లుగా ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది.

### గొప్ప అనుభూతి..



సెలవు రోజుల్లో విధిగా ల్యాబ్‌కు వెళ్తా. పుస్తకాల్లో చదివిన అంశాలను ప్రయోగాత్మకంగా చూడటం గొప్ప అనుభూతిని ఇస్తుంది. ప్రతి వస్తువు కూడా సైన్స్ ఆధారంగా పని చేస్తుందని తెలుసుకోవడం సంతోషాన్ని ఇస్తుంది. సార్ వాళ్ల ల్యాబ్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. ఎవైనా సందేహాలుంటే నివృత్తి చేస్తారు.

– సుస్మిత, జెడ్పీ ఉన్నత పాఠశాల, మరికల్ (నారాయణపేట)

### ప్రతి వారం వెళ్తా..



ప్రతి వారం క్రమం తప్పకుండా ల్యాబ్‌కు వెళ్తా. అక్కడ మనకు ఇష్టమైన ప్రయోగాలు చేసుకునే అవకాశం ఉంది. సెలవుల్లో సమయం వృథా చేయకుండా ఎన్నో కొత్త అంశాలు నేర్చుకోవచ్చు. అక్కడ ప్రయోగాలు చేశాక పాఠ్యాంశాలు చాలా వరకు సులువుగా అర్థమవుతాయి.

– సాయిసుహాస్, స్వామి నారాయణ్ గురుకుల్, జడ్చర్ల


### శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం..



సుమారు రూ.12 లక్షలు వెచ్చించి భౌతిక, రసాయన, జీవశాస్త్ర ల్యాబ్‌ను ఏర్పాటు చేశాం. విద్యార్థులకు ప్రయోగాలతో పాటు అనేక అంశాలు ఉచితంగా నేర్పిస్తున్నాం. 2040 వరకు జిల్లా నుంచి అనేక మంది గొప్ప శాస్త్రవేత్తలను తయారు చేసేలా కృషి చేస్తున్నాం.

– టీఎస్ శ్రీధర్, సైన్స్ ఉపాధ్యాయుడు, ఫౌండర్, డ్రీంఫోర్స్ ఫౌండేషన్

**కురుక్షేత్ర సూత్రధారి శ్రీకృష్ణుడి గురించి గొప్పగా చెప్పుకుంటాం. కృష్ణం వందే జగద్గురుం.. అంటూ ఆ కృష్ణ భగవానుడిని జగత్తుకంతా గురువుగా భావిస్తాం. కానీ శ్రీకృష్ణుడికి కూడా సాందీపుడు గురువన్న విషయం చాలా మందికి తెలియదు.** అజ్ఞానాంధకారాన్ని పారదోలి జీవితానికి వెలుగు బాటను ప్రసాదించే గురువు రుణాన్ని శిష్యుడు ఏ రూపంలోనూ తీర్చుకోలేడు. అందుకే మాతృదేవోభవ.. పితృదేవోభవ తర్వాత గురువుకే ఆ స్థానం ఇచ్చారు.




### తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం..

**గద్వాల:** పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవిశంకర్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సృజనాత్మక బోధన విభాగంలో స్థానం సంపాదించారు. ఆయన వినూత్నంగా రూపొందించిన జీవశాస్త్ర సంఖ్యా క్యాలెండర్–2021కు గాను ఈ గౌరవం దక్కింది. క్యాలెండర్‌లోని అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించారు. రవిశంకర్ ఉండవల్లి మండలం పుల్లూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.



అంతే కాకుండా నూతన జాతీయ విద్యావిధానం–2020కి సంబంధించిన పలు అంశాలతో తెలుగులో డిజిటల్ పోస్టర్‌ను రూపొందించి జాతీయ స్థాయి గుర్తింపు సాధించాడు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడారు. కొత్త పద్ధతుల్లో బోధించడం ద్వారా విద్యార్థుల్లో అభ్యసన ప్రక్రియపై ఆసక్తి పెరుగుతుందని తెలియజేశారు.

### పాఠశాలకు పూర్వవైభవం


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి

**నారాయణపేట రూరల్:** మండలంలోని లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాలలో ఒకప్పుడు సుమారు 100 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉండేవారు. రానురాను విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గడంతో రేషనలైజేషన్ ప్రక్రియలో మూడు పోస్టులు పోయి ఒకే ఉపాధ్యాయుడితో ఎస్‌టీపీఎస్‌గా మారింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరి దుర్గంధంతో నిండిపోయింది. 2018లో విద్యార్థుల సంఖ్య ఏడుగురికి పడిపోయింది. అదే సమయంలో బదిలీలు జరగడంతో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బదిలీకాగా.. ఆయన స్థానంలో బోయిన్‌పల్లితండా నుంచి యాద్గిర్ జనార్దన్‌రెడ్డి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. పరిస్థితి చూసి చలించిన అతను సొంత డబ్బుతో మొదటి రోజే స్వచ్ఛ పాఠశాల పేరుతో పాఠశాలలోని తరగతి గదులు, ఆవరణ పూర్తిగా శుభ్రం చేయించడంతో పాటు పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. దాతల సహకారంతో కిటికీలు, తలుపులు మరమ్మతు చేయించి, ఆవరణలో మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణంలోకి తీసుకొచ్చారు. గోడలపై రంగురంగుల బొమ్మలు వేయించి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. అతడి పనితీరును గుర్తించిన గ్రామస్తులు ఆయనకు సహకరిస్తూ తమ పిల్లలను గ్రామ పాఠశాలకు పంపడం ప్రారంభించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సదరు ఉపాధ్యాయుడు తనకు తోడుగా అన్ని సబ్జెక్టులకు వలంటీర్లను నియమించుకొని చక్కగా బోధిస్తూ పిల్లలను తీర్చిదిద్దుతున్నారు. ప్రైవేట్ విద్యార్థుల కంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చురుగ్గా కనిపించడం గ్రామస్తులను మరింత దగ్గర చేసింది. క్రమంగా విద్యార్థుల సంఖ్యను పెంచుకుంటూ ఈ ఏడాది 79కి తీసుకొచ్చారు. విద్యార్థులు లేక వెలవెలబోయిన పాఠశాలకు పూర్వవైభవం తీసుకు రావడంలో జనార్దన్‌రెడ్డి సఫలీకృతులయ్యారు.

### 'రాయినిపల్లి'తో మారిన రూపురేఖలు..



**పెబ్బేర్ రూరల్:** వనపర్తి మండలం చిట్యాల తూర్పుతండా ప్రాథమిక పాఠశాలలో 2011 ముందు వరకు 10 మంది విద్యార్థులు కూడా లేరు. జిల్లాకేంద్రానికి కేవలం 3 కిలోమీటర్ల దూరం ఉండటంతో చిన్నారుల తల్లిదండ్రులు చాలావరకు ప్రైవేటు పాఠశాలలకు పంపించేవారు. బడిపై తండావాసులకు సదాభిప్రాయం లేకపోవడంతో పాఠశాల ఆవరణ అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా ఉండింది. ఇక్కడికి ఏ ఉపాధ్యాయుడు కూడా రావడానికి ఇష్టపడేవారు కాదు. 2011వ సంవత్సరంలో రాయినిపల్లి శ్రీనివాసులు అనే ఉపాధ్యాయుడు బదిలీపై ఇక్కడికి రావడంతో పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. ఇక్కడి పరిస్థితులను అవగాహన చేసుకొని ఎలాగైనా మార్పు తీసుకురావాలని నిర్ణయించుకున్నారు శ్రీనివాసులు. ఒకవైపు ఉన్న విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే.. మరోవైపు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలపై నమ్మకం కలిగించే ప్రయత్నాలు చేయడం ప్రారంభించారు. ప్రతి ఏటా యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించడం, బాలికలతో చదువుతో పాటు కుట్టుమిషన్లు తెప్పించి కుట్లు, అల్లికలపై శిక్షణ ఇప్పించడం, ప్రతి ఏటా వినాయక చవితికి విద్యార్థులతో మట్టి విగ్రహాలు చేయించడం, వ్యాసరచన, ఉపన్యాసం, డ్రాయింగ్‌లో శిక్షణనిచ్చి మండల, జిల్లాస్థాయి పోటీలకు తీసుకెళ్లేవారు. అలాగే పేద విద్యార్థులకు ఉచితంగా గురుకుల శిక్షణనిస్తున్నారు. 2013 నుంచి ఇప్పటి వరకు 103 మంది పరీక్షలు గురుకుల ప్రవేశ పరీక్ష రాయగా 95 మంది వివిధ గురుకులాల్లో సీట్లు పొందారు. పాఠశాలలో పొదుపు పథకం 'సంచాయిక' ప్రారంభించి విద్యార్థులకు పొదుపు నేర్పిస్తున్నారు. ఇలా ఒక్కొక్కటిగా అతడు చేస్తున్న కార్యక్రమాలకు తండావాసులు, విద్యార్థులు ఆకర్షితులు కావడం, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తుండటంతో 2015 నుంచి ఇప్పటి వరకు గ్రామంలోని ప్రతి పిల్లవాడు ఈ బడిలోనే చదువుతున్నారు.

### ఊరు మెచ్చిన ఉపాధ్యాయుడు

**కొల్లాపూర్:** మండలంలోని సోమశిల గ్రామ యూపీఎస్ పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బ్యాంగి కృష్ణప్రసాద్‌ను పాఠశాల విద్యార్థులే కాకుండా ఊరంతా మెచ్చిన ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారు. విద్యాబోధనతో పాటు, సామాజిక అంశాలు, సేవా కార్యక్రమాలపై విద్యార్థులను నిరంతరం చైతన్యం చేస్తూ.. ముందుకు సాగుతున్నారు. తన సొంత డబ్బులు రూ.40 వేలు వెచ్చించి పాఠశాలకు రంగులు వేయించాడు. మద్యపాన నిషేధం, చెత్త సేకరణ, రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా వాహనాలకు రేడియం స్టిక్కర్లు వేసుకోవాలని అవగాహన కార్యక్రమాలు చేపట్టాడు. దాతల సహకారంతో పాఠశాలలో డిజిటల్ బోర్డులు, ప్రొజెక్టర్ పెట్టించడంలో, ఆటల సామగ్రి ఏర్పాటు చేయడంలో క్రియాశీలంగా వ్యవహరించాడు. ప్రస్తుతం పాఠశాలలో అభివృద్ధి పనుల కోసం దాతలు ఇచ్చిన మొత్తం రూ.2 లక్షల నగదు నిల్వలు ఉన్నాయి. ఆయన చేస్తున్న సేవలను గుర్తించి 2017లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందించారు. విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అంటున్నారు.


గ్రామంలోని దేవాలయ ఆవరణలో పూలమొక్కలపై విద్యార్థులకు వివరిస్తున్న కృష్ణప్రసాద్(ఫైల్)

### కొత్తపుంతలతో విద్యాబోధన

**అమరచింత:** విద్యార్థులకు చక్కటి అలవాట్లతో పాటు చదువును అందించేందుకు కృషి చేస్తున్నాడు మండలంలోని చంద్రనాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న క్యామ సుభాష్. విద్యార్థులు తెలుగుతో పాటు ఆంగ్లంపై పట్టు సాధించాలని భావించి తనదైన శైలిలో కొత్త విధానాలను ఆవిష్కరించి వాటిని విద్యార్థులకు వివరిస్తూ.. ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాడు. జాలిఫోనిక్ యాప్ ద్వార విద్యార్థులకు డిజిటల్ విద్యాభ్యాసం చేయిస్తున్నాడు. వీటితో విద్యార్థులు సులువుగా ఇంగ్లిష్ చదవడం, రాయడం నేర్చుకుంటున్నారు. గ్రామస్తుల సహకారంతో 32 ఇంచుల స్మార్ట్ టీవీ కొనుగోలు చేసి యూట్యూబ్ ద్వారా డిజిటల్ బోధన చేస్తున్నారు. గ్రామీణ విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే ఆంగ్ల పదాలు పలకడం, చదివేందుకు కృషిచేస్తున్నానని అన్నారు. వీటి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం చంద్రనాయక్ తండాలో విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించే ప్రయత్నం చేస్తున్నానన్నారు.


చంద్రనాయక్ తండాలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న సుభాష్

## క్లుప్తంగా

### చెక్‌డ్యాంలో మహిళ ఆత్మహత్య

**మిడ్జిల్:** దుందుభీ వాగులో నిర్మించిన చెక్‌డ్యాంలో పడి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండల పరిధిలోని కొత్తూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కొత్తూర్‌కు చెందిన లక్ష్మీదేవి(65)కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. దీంతో జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు.


లక్ష్మీదేవి(ఫైల్)

### జానంపేటలో విషాదం

**అడ్డాకుల:** మూసాపేట మండలం జానంపేటకు చెందిన ఓ యువకుడు ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆదిబట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పల్లి పర్వతాలు, పద్మ దంపతుల పెద్ద కుమారుడు పల్లి శివకుమార్ (23) ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేసేవాడు. శనివారం రాత్రి హైదరాబాద్ వెళ్లడానికి కర్నూలులో బొలెరో వాహనం ఎక్కాడు. అర్ధరాత్రి సమయంలో ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆదిబట్ల వద్ద శివకుమార్ ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురికావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించారు. పర్వతాలుకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉండగా చిన్న కుమారుడు మూడేళ్ల వయసులోనే చనిపోయాడు. ఇప్పుడు పెద్ద కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## పులుల సంరక్షణకు గడ్డి క్షేత్రాలే ముఖ్యం


నల్లమల అటవీ సరిహద్దు ప్రాంతంలోని గడ్డి మైదానాలను పరిశీలిస్తున్న అధికారులు

**మన్ననూర్:** పెద్దపులుల సంరక్షణలో భాగంగా గడ్డి మైదానాలు ప్రముఖ పాత్ర పోషించనున్నట్లు గడ్డి మైదానాల నిర్వహణ నిపుణుడు డాక్టర్ మురత్కార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలోని సీబీఈటీ ఆవరణలో పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్ సమక్షంలో గడ్డి మైదానాల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణపై అటవీశాఖ అధికారులు, సిబ్బందికి ప్రొజెక్టర్ సాయంతో వివరించారు. అభయారణ్యంలో గడ్డి సమృద్ధిగా ఉంటే శాఖాహార జంతువుల సంతతి ఆశించిన స్థాయిలో వృద్ధి చెందుతాయని అన్నారు. దీంతో పెద్దపులికి కావాల్సిన ఆహారం లభించడంతో పాటూ అదే స్థాయిలో పెద్దపులుల వృద్ధి చెందేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలోని రోళ్లబండ, జీలుగాయికుంట తదితర అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఇప్పటికే నిర్వహణలోని గడ్డి మైదానాలను పరిశీలించారు. పెద్దపులుల మనుగడకు ప్రత్యేక కృషి చేయాలని, క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ చీఫ్ కంసర్వేటర్ శివాణి డోంగ్రే, యాదాద్రి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నల్లగొండ, వికారాబాద్ సర్కిల్ అధికారులు, డీఎఫ్‌ఓలు రోహిత్ గోపిడి, ఎఫ్‌డీఓ శ్రీనివాస్, రేంజ్ అధికారులు ప్రభాకర్, ఆదిత్యా తదితరులు పాల్గొన్నారు.

### నేచర్ గైడ్‌లకు శిక్షణ..

అటవీశాఖలో నేచర్ గైడులుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సీబీఈటీలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతిని ఆస్వాదించడంతో పాటూ వన్య ప్రాణులను వీక్షించేందుకు అభయారణ్యంలోకి వచ్చే ప్రకృతి ప్రియులు పర్యాటకులతో సిబ్బంది నడుచుకునే విధి, విధానాలు, రక్షణ తదితర అంశాలపై సిబ్బందికి అధికారులు వివరించారు.

## జిల్లాలో మరో సైబర్ నేరం

**వనపర్తి:** సైబర్ నేరాలపై పోలీస్‌శాఖ ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, నేరాలు అదుపు కావడం లేదు. తాజాగా సోమవారం వనపర్తి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. కొన్నిరోజుల క్రితం ఆన్‌లైన్ లింక్‌ను క్లిక్ చేయటంతో సుమారు రూ.3లక్షలు పోగొట్టుకున్న ఘటన మరువక ముందే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. మోసపోతున్న వారంతా చదువుకున్నవారే కావటం గమనార్హం. జిల్లా కేంద్రానికి చెందిన అనంత మనోజ్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. చిన్నపెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చనే మెసేజ్ ఫోన్‌కు వచ్చింది. ఆ మెసేజ్‌ను క్లిక్ చేయడంతో నాలుగు విడతలుగా సుమారు రూ. 1లక్ష వరకు పోగొట్టుకున్నాడు. బాధితుని తమ్ముడు ప్రేమ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు.



## చెంచుల అభివృద్ధి పనుల పరిశీలన

**మన్ననూర్:** గిరిజన సహకార సంస్థ(జీసీసీ) కమిషనర్, ఆర్‌ఎంల సూచన మేరకు మార్కెటింగ్ జీఎం సతీష్ కుమార్ నేతృత్వంలో సంస్థలో నూతనంగా నియమితులైన ఉద్యోగుల బృందంతో కలిసి ఎంఎస్‌ఎంఈ యూనిట్లను సోమవారం పరిశీలించారు. కొంతకాలంగా ఐటీడీఏ సమక్షంలో చెంచుల ఆర్థికాభివృద్ధి కోసం మన్ననూర్, మల్లాపూర్‌లో ఏర్పాటు చేసి నిర్వహణలోని చింతపండు, తేనె సేకరణ యూనిట్లను బృందం సభ్యులు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో తమ కుటుంబాల అభివృద్ధి కోసం చెంచులు చేపట్టిన పనులను పరిశీలించారు. చెంచుల అభివృద్ధికి మరింతగా సాయం అందించే దిశగా ఉన్నతాధికారులకు వివరిస్తామని బృందం సభ్యులు తెలియజేశారు. సంతోష్‌కుమార్, సాయితులసి, భిక్షమయ్య, జయరాజ్, రమణ పాల్గొన్నారు.


మన్ననూర్‌లో చింతపండు యూనిట్‌ను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

### ఇంట్లో చోరీ

**బాలానగర్:** ఇంటి తాళం విరగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మూడావత్ సంతోష్ జూలై 29న అత్యవసర పనిమీద కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లారు. హైదరాబాద్ నుంచి ఈ నెల 4న ఇంటికొచ్చి చూడగా, ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో సెల్ఫ్‌లో బట్టల కింద రూ.51వేల నగదు, దేవుని గళ్లబుడ్డిలోని నగదు, మొబైల్‌ఫోన్లు, ఇతర వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సతీష్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తలిపారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**దేవరకద్ర:** చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గోపన్‌పల్లిలో సోమవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ వెంకటేశ్ కథనం మేరకు.. కౌకుంట్ల మండలం పుట్టపల్లికి చెందిన ముష్టిగొల్ల దశరథ (53) ఆదివారం ఉదయం గోపన్‌పల్లి శివారు శేరి చెరువులో చేపల వేటకు వెళ్లి రాత్రి వరకు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా దశరథ మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. చేపల వల కాళ్లకు చుట్టుకోవడంతో మునిగి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. సోదరుడు ముష్టి శ్రీనివాసులు, తండ్రి కర్రెన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

### వలలో చిక్కుకొని మరొకరు..

**కొత్తకోట రూరల్:** చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం ప్రకారం.. పెద్దమందడి గ్రామానికి చెందిన జంగం శ్రీను(42) ఆదివారం ఉదయం చేపల వేటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులకు ఫోన్ చేసి అడిగినా అతని ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులోని ఊరచెరువు దగ్గర వెతకడంతో చెప్పులు కనిపించాయి. అనుమానంతో చెరువులోకి దిగి వెతకగా శ్రీను మృతదేహం లభ్యమైంది. అతని కాళ్లకు చేపల వల చుట్టుకుని ఉండటంతో ప్రమాదవశాత్తు మృతి చెందినట్టు భావించారు. అతని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

## క్లుప్తంగా...

### 'రెరా' రిజిస్ట్రేషన్ తప్పనిసరి



**చైర్మన్ సత్యనారాయణ**

**సాక్షి, హైదరాబాద్:** రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు 'రెరా' రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పొందాలని ఆ సంస్థ చైర్మన్ ఎన్.సత్యనారాయణ స్పష్టం చేశారు. తద్వారా కొనుగోలుదారుల నమ్మకానికి భరోసా ఇవ్వాలని అన్నారు. 'రెరా' నిబంధనలు ఉల్లంఘించిన మూడు ప్రాజెక్టులకు సోమవారం ఆయన షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 15 రోజులలోగా వివరణ ఇవ్వాలని సంబంధిత రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను ఆదేశించారు. షాద్‌నగర్ సమీపంలోని చెరుకుపల్లి, కొందుర్గ్‌లో స్వర్గసీమ శాండిల్ ఉడ్ ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్ 'స్వర్గసీమ సుకేతన' పేరుతో నివాస ప్లాట్లు విక్రయించే వెంచర్ చేపట్టి 'రెరా' రిజిస్ట్రేషన్ లేకుండా మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపట్టడంపై షోకాజ్ నోటీసు జారీ చేశారు. మాదాపూర్‌కు చెందిన జేఎల్ఎల్ అనే నిర్మాణ సంస్థ 'రెరా' రిజిస్ట్రేషన్ పొందకుండా రియల్ ఎస్టేట్ వ్యాపార కార్యక్రమాలు నిర్వహించడం అథారిటీ దృష్టికి వచ్చినందున షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. మహేశ్వరం, తుక్కాపూర్ గ్రామం, శ్రీనగర్ ప్రాంతాలలో ఓఆర్ఆర్ ఎగ్జిట్ 14 ప్రాంతంలో 'కాంన్సెల్లా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు' రెరా రిజిస్ట్రేషన్ ఉండి కూడా ప్రకటనలో, వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ నంబర్ చూపని కారణంగా షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

### వెంకటేశ్వర హ్యాచరీస్ ఆస్తులు జప్తు చేసిన ఈడీ

**మహారాష్ట్ర, కర్ణాటకలో కలిపి రూ.65.53 కోట్ల విలువైన స్థిరాస్తుల జప్తు**

**సాక్షి, హైదరాబాద్:** నగదు చెల్లింపులలో అక్రమాలపై ఫెమా చట్టాల (ఫారిన్ ఎక్స్ఛేంజ్ మెనేజ్‌మెంట్ యాక్ట్) కింద నమోదైన కేసులో వెంకటేశ్వర హ్యాచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన రూ.65.53 కోట్ల విలువైన స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జప్తు చేశారు. సదరు కంపెనీ నుంచి లండన్‌లోని వెంకీస్ ఓవర్‌సీస్ లిమిటెడ్ కంపెనీకి 2011 నుంచి అక్రమంగా నిధుల మళ్లింపు జరిగినట్లు గతంలోనే గుర్తించిన ఈడీ అధికారులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. ఈ అక్రమ చెల్లింపుల సొమ్ముతో లండన్‌లోనూ స్థిరాస్తులను కొనుగోలు చేసినట్లు నిర్ధారించారు. అన్ని కీలక ఆధారాలు సేకరించిన ఈడీ అధికారులు, వెంకటేశ్వర హ్యాచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన కర్ణాటక, మహారాష్ట్రలోని తొమ్మిది స్థిరాస్తులను జప్తు చేసినట్టు వెల్లడించారు.

# చిట్టాలో చినబాబు!

▶ మొదటి పేజీ తరువాయి



మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణలు దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. ఆ రోజు చంద్రబాబు పీఏ శ్రీనివాస్ డబ్బుల పంపిణీ గురించి అడగ్గా కిలారు రాజేష్‌కు రూ.4.5 కోట్లను పార్టీ ఆఫీసులో అందించినట్టు పార్థసాని పేర్కొన్నాడు. అంకిత్ బలదూత ద్వారా రూ.2.2 కోట్లు పంపగా, రఘు రేలాకు సన్నిహితుడైన శ్రీకాంత్ ద్వారా మిగిలిన మొత్తాన్ని పంపినట్టు చెప్పడంతో ''అయితే ఓకే..'' అంటూ చంద్రబాబు పీఏ శ్రీనివాస్ బదులిచ్చాడు. ఈమేరకు నగదు తరలింపులకు సంబంధించి శ్రీకాంత్ ఫోన్ నుంచి జరిగిన వాట్సాప్ సంభాషణలను కూడా ఐటీ అధికారులు జత చేశారు. వాంగ్మూలం నమోదు సమయంలో ఈ సంభాషణలను మనోజ్ వాసుదేవ్‌కు చూపగా అది నిజమేనని అంగీకరించినట్లు ఐటీశాఖ పేర్కొంది. డేటా చౌర్యం ఐటీ గ్రిడ్ కేసులో కూడా కిలారు రాజేష్ కీలక పాత్రధారిగా వ్యవహరించిన విషయం విదితమే.

**రఘు ద్వారా రూ.20.18 కోట్లు తరలింపు..**

విశాఖకు చెందిన రఘు రేలా ఆర్‌వీఆర్ పేరుతో రియల్ ఎస్టేట్‌తో పాటు 18కిపైగా కంపెనీలను ఏర్పాటు చేసి వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. షాపూర్జీ పల్లోంజీ నుంచి అక్రమంగా నగదు తరలింపులో రఘు రేలా కీలకపాత్ర పోషించినట్లు గుర్తించిన ఐటీ అధికారులు ఆర్‌వీఆర్ గ్రూపులో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న సాక్ష్యాల ఆధారంగా మనోజ్ వాసుదేవన్‌ను విచారించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ ఆదేశాల మేరకు రఘు రేలా ద్వారా మొత్తం రూ.20.18 కోట్లను తరలించినట్లు మనోజ్ పార్థసాని అంగీకరించాడు. ఈ నగదు తరలింపులో రఘుకు సన్నిహితులైన కృష్ణ, నారాయణ అనే ఇద్దరు వ్యక్తులు కీలకంగా వ్యవహరించారని, అయితే వారి గురించి తనకు ఎటువంటి వివరాలు తెలియవని పేర్కొన్నాడు. విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌కు ఈ మొత్తాన్ని తరలించారని, ఇందుకు ఎక్సెల్ షీట్ స్పష్టమైన ఆధారమని ఐటీ శాఖ వెల్లడించింది.

**ఓటమిపై ఆవేదన**

నగదు తరలింపులో కీలకంగా వ్యవహరించిన మనోజ్ వాసుదేవ్ పార్థసాని 2019 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. టీడీపీ ఘోరంగా ఓడిపోయి చంద్రబాబు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆయన పీఏ శ్రీనివాస్‌కు మనోజ్ వాసుదేవ్ ఒక మెసేజ్ పంపారు. తన జీవితంలో ఇటువంటి దారుణమైన రాజీనామా లేఖను చూడలేదని అందులో పేర్కొన్నారు. వీరి మధ్య బంధం ఎంత బలంగా ఉందనేందుకు ఆ మెసేజ్ నిదర్శనమని ఐటీ శాఖ తన నోటీసులో పేర్కొంది. నిర్మాణ రంగ సంస్థల నుంచి నగదును అక్రమంగా తరలించారనేందుకు ఇవి తిరుగులేని సాక్ష్యాలని, నగదు తరలింపులో మీ తనయుడు లోకేష్ సన్నిహితులు కీలకపాత్ర పోషించారనేందుకు ఇవన్నీ నిదర్శనమని చంద్రబాబుకు జారీ చేసిన నోటీసుల్లో ఐటీ శాఖ స్పష్టంగా పేర్కొంది.

# సిరిధాన్యాలపై అంతర్జాతీయంగా ఆసక్తి

- కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే
- విత్తనాలు, ఆహార ఉత్పత్తులపై విదేశీ ప్రతినిధుల వాకబు
- వ్యవసాయంపై జీ–20 సదస్సు ప్రారంభం



**సాక్షి, హైదరాబాద్/శంషాబాద్:** ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి అనుకూలమైన సిరిధాన్యాలపై ఇప్పుడు అంతర్జాతీయంగానూ ఆసక్తి పెరుగుతోందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. భారత్ అధ్యక్షతన జరుగుతున్న జీ–20 సమావేశాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో మొదలైన 'క్లైమేట్ రెసిలియెంట్ ఫార్మింగ్' టెక్నికల్ వర్క్‌షాప్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జీ–20 సమావేశాల్లో పాల్గొంటున్న అనేక దేశాల ప్రతినిధులు, సిరిధాన్యాలపై ఆసక్తికనబరుస్తున్నారని, విత్తనాలతోపాటు ఉత్పత్తులు, వాటి తయారీ పద్ధతుల గురించి వాకబు చేస్తున్నారని తెలిపారు. విదేశీ ప్రతినిధుల ఆసక్తి ముఖ్యంగా రాగి విత్తనాలపై కనిపించిందని, మరికొందరు ఇతర ధాన్యాల గురించి కూడా అడిగారని, దేశంలోనూ ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు కూడా సిరిధాన్యాలు సాగు చేసే దిశగా అడుగులు వేస్తున్నాయని వివరించారు.

**వాతావరణ మార్పులు తట్టుకోవడానికి ..**

వాతావరణ మార్పుల ప్రభావం వల్ల వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిని ఆహార భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ సమస్యను అధిగమించేందుకు అందరూ చేతులు కలపాలని మంత్రి పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేందుకు భారత్ సిరిధాన్యాలను ప్రోత్సహిస్తోందన్నారు. చాలా రాష్ట్రాల్లో సిరిధాన్యాలను రేషన్ డిపోల ద్వారా కూడా అందిస్తున్నామని గుర్తు చేశారు. వ్యవసాయం విషయంలో కొన్ని రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా సహకరించడం లేదని మంత్రి కరంద్లాజే ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారతీయ వ్యవసాయ పరిశోధన సమాఖ్య (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులను తట్టుకునేందుకు ఐసీఏఆర్ ఇప్పటికే దాదాపు 1,880 కొత్త వంగడాలను సిద్ధం చేయడంతోపాటు నీరు, ఎరువులు వంటి వ్యవసాయ కార్యకలాపాల సమర్థ నిర్వహణకు ప్రణాళికలను కూడా రూపొందించిందని తెలిపారు. కొత్తగా అభివృద్ధి చేసిన వంగడాలన్నీ ఇప్పుడు వాడకంలో ఉన్నాయని, గత ఏడాది గోధుమ వంగడం అధిక వర్షాలను కూడా తట్టుకుని మంచి దిగుబడులు ఇచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్–క్రిడా డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్, ఐసీఏఆర్–డీడీజీ ఎస్.కె.చౌదరి, డేర్ కార్యదర్శి అల్కా నంగియా ఆరోరా పాల్గొన్నారు.

# మృత్యు పాశాలు

- విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ముగ్గురి దుర్మరణం
- మంచిర్యాలలో తండ్రి, కుమారుడు..
- సిద్దిపేట జిల్లాలో పెళ్లయిన మూడు రోజులకే నవ వరుడు..

వెలుగులు పంచే విద్యుత్ తీగలు బతుకుల్లో అంధకారం నింపాయి. ముగ్గురి జీవితాలకు ఉరితాళ్లయ్యాయి. రెండు కుటుంబాలకు తీరని శోకం మిగిల్చాయి. దండెంపై బట్టలు ఆరేస్తూ విద్యుదాఘాతానికి గురైన తండ్రి.. అతన్ని కాపాడబోయిన కొడుకు కన్నుమూస్తే.. మరోచోట కొత్త పెళ్లికొడుకు పెళ్లయిన మూడోరోజే విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ సంఘటనలు రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపాయి..


నిరంజన్‌చారి (ఫైల్)


అరుణ్ కుమార్(ఫైల్)


రాజేందర్ (ఫైల్)


కారణమైన ఇనుప కూలర్, పైన దండెం

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/సిద్దిపేట కమాన్:** మంచిర్యాల పట్టణం ఏసీసీ కాలనీ శివరామాలయం వీధికి చెందిన ఎడ్ల రాజేందర్ (50), సెక్యూరిటీ గార్డుగా, భార్య సరోజ ఇళ్లలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. ఎంసీసీ క్వార్టర్‌లో నివసిస్తున్న వీరి కొడుకు అరుణ్‌కుమార్(17) పట్టణంలోని ఓ బైక్ షోరూంలో పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో షోరూం నుంచి అరుణ్‌కుమార్ ఇంటికి భోజనానికి వచ్చాడు. ఆ సమయంలో తండ్రి రాజేందర్ స్నానం చేసి, దండెంపై తువ్వాలు ఆరేస్తుండగా ఇనుప కూలర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తండ్రి అరుపులు విని అతన్ని కాపాడబోయిన అరుణ్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. రాజేందర్ తమ్ముడు కర్రతో విద్యుత్‌తీగను గట్టిగా కొట్టడంతో.. తండ్రీకొడుకులు కింద పడ్డారు. అనంతరం ప్రథమ చికిత్సలో భాగంగా వారిద్దరి శ్వాస ఆడేందుకు ప్రయత్నించినా కోలుకోలేదు. దీంతో 108 అంబులెన్సులో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా తండ్రీకొడుకులు ఇద్దరూ అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**వివాహమైన మూడ్రోజులకే..**

సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌కు చెందిన జయలక్ష్మి, పెంటయ్య చారి దంపతులకు నలుగురు కూతుళ్లు, ఏకైక కుమారుడు రామోజు నిరంజన్‌చారి (38) ఉన్నారు. వీరు కుటుంబంతో కలిసి సిద్దిపేట పట్టణం నాసర్‌పురలో నివసిస్తున్నారు. నిరంజన్ 2003 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఎంపికై 2005 నుంచి పనిచేస్తున్నారు. 2012 నుంచి సిద్దిపేట ఇందిరానగర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. నిజామాబాద్ బోధన్‌కు చెందిన అమ్మాయితో శనివారం ఘనంగా వివాహం జరిగింది. సోమవారం పట్టణంలోని ఎన్‌జీవో భవన్‌లో ఘనంగా రిసెప్షన్ ఏర్పాట్లు చేశారు. రిసెప్షన్‌కు బంధువులను ఆహ్వానించడానికి నిరంజన్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ తన ఇంటిపైకి వెళ్లారు. ఈ క్రమంలో భవనానికి అలంకరించిన విద్యుద్దీపాలకు సపోర్ట్‌గా కట్టిన తీగకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు, నవ వధువు రోదించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సహోపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అశ్రునయనాలతో నిరంజన్ మృతదేహానికి అంతిమయాత్ర నిర్వహించి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

# ప్రజల నుంచి వసూలు చేయాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రం స్పష్టం చేసింది.

**ఎంత సబ్సిడీ చెల్లించకపోతే అంత మోత..**

రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం సబ్సిడీతో పోలిస్తే వాస్తవంగా చెల్లిస్తున్న సబ్సిడీ తక్కువగా ఉంటుండటంతో డిస్కంలు భారీ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నాయి. దీంతొ రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన సబ్సిడీ మేరకు చార్జీలను పెంచి వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిందేనని కేంద్రం ఆదేశించింది. ఉదాహరణకు గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేందుకు యూనిట్‌కు రూ.8 చార్జీ ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇందులో రూ.4 సబ్సిడీ ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం యూనిట్‌కు రూ.2 మాత్రమే సబ్సిడీగా చెల్లిస్తోంది. దీంతో వినియోగ దారులు చెల్లించే రూ.4కు లోటు సబ్సిడీ రూ.2 కలి పి మొత్తం రూ.6కు చార్జీ పెంచుకోవాల్సిందిగా కేంద్రం సూచించింది. ఒకవేళ ప్రభుత్వం సబ్సిడీ పూర్తి గా చెల్లించని పక్షంలో రూ.8 వసూలు చేసుకోవాల ని ఆదేశించింది.

**ఇకపై సబ్సిడీల వివరాలతో త్రైమాసిక నివేదికలు**

కేంద్రం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు పూర్తిస్థాయిలో విద్యుత్ సబ్సిడీలను ఎప్పటికప్పుడు ముందస్తుగా డిస్కంలకు చెల్లించకతప్పని పరిస్థితి నెలకొంది. కాగా కేటగిరీల వారీగా వినియోగదారులు వాడిన విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలను కచ్చితంగా లెక్కించడానికి కొత్త విధానాన్ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. కేటగిరీల వారీగా ఓ త్రైమాసికంలో సబ్సిడీ వినియోగదారులు ఎన్ని యూనిట్ల విద్యుత్ వాడారు? ప్రతి యూనిట్ విద్యుత్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ ఎంత? రాష్ట్ర ప్రభుత్వం వాస్తవంగా చెల్లించిన సబ్సిడీ ఎంత? ఇంకా రావాల్సిన సబ్సిడీ బకాయిలు/లోటు ఎంత? అనే వివరాలతో రాష్ట్రాల ఈఆర్సీలు త్రైమాసిక నివేదికను విడుదల చేయాలి. ప్రతి త్రైమాసికం ముగిసిన తర్వాత 30 రోజుల్లోగా ఈఆర్సీకి డిస్కంలు ఈ మేరకు వివరాలతో నివేదికను సమర్పిస్తాయి. ఈ ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన సవరణలతో 30 రోజుల్లోగా ఈఆర్సీ తుది త్రైమాసిక నివేదికను ప్రకటిస్తుంది. నిబంధనల మేరకు విద్యుత్ సబ్సిడీ అకౌంటింగ్ జరగలేదని, సబ్సిడీల కోసం ప్రభుత్వానికి బిల్లులు పంపించలేదని తేలితే డిస్కంలోని సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని ఈఆర్సీలను కేంద్రం ఆదేశించింది.

### జూరాలకు 1,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



**ధరూరు:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీటి రాక స్వల్పంగా పెరిగి తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం ప్రాజెక్టుకు 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సాయంత్రం 7గంటలకు 1,500 క్యూసెక్కులకు తగ్గినట్లు పేర్కొన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో నీటి పంపింగ్ నిలిపివేశారు. ఆవిరి రూపంలో 99 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, కుడి కాల్వకు 298 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 60 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 712 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.363 టీఎంసీలు నిల్వ ఉంది.

**నిండుకుండలా రామన్‌పాడు జలాశయం**

**మదనాపురం:** రామన్‌పాడు జలాశయంలో సోమవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 183 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. వ్యవసాయ అవసరాల కోసం ఎన్టీఆర్ కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు కుడి, ఎడమ, కాల్వ ద్వారా 65 క్యూసెక్కులు, రాజీవ్ భీమా–2 ద్వారా 851 క్యూసెక్కులు తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్ రెడ్డి తెలిపారు.

**28 అడుగులకు చేరిన కేఎస్పీ నీటిమట్టం**

**దేవరకద్ర:** కోయిల్‌సాగర్ నీటి మట్టం సోమవారం సాయంత్రం వరకు 28 అడుగులకు చేరింది. ఆదివారం సాయంత్రం 27.6 అడుగుల మేర నీరు ఉండగా.. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు మూసివేడయంతో నీటిమట్టం పెరిగింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా.. మరో 4.6 అడుగుల నీరు చేరితే గేట్లు తెరవనున్నారు.

**శ్రీశైలంలో 850.6 అడుగుల నీటిమట్టం**

**దోమలపెంట:** శ్రీశైలం జలాశయంలో సోమవారం 850.6 అడుగుల వద్ద 81.4594 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,000, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,405, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 0.172 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 322 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదిలారు.

# బీసీలకు సగం సీట్లు కేటాయించాల్సిందే


సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు సగం స్థానాలను కేటాయించాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్‌లోని టీఎన్‌జీఓ భవన్‌లో బీసీ సింహగర్జన సన్నాక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు బీఆర్ఎస్‌కంటే ఎక్కువ సీట్లు ఇస్తామని చెప్పడం మంచిదేనన్నారు. దాని ప్రకారం కచ్చితంగా బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించాలని లేదంటే కాంగ్రెస్ పార్టీని బీసీలు నమ్మరని అన్నారు. బీసీలకు టికెట్లు ఇవ్వకుండా బీఆర్ఎస్ అన్యాయం చేసిందని, కాంగ్రెస్, బీజేపీలు అన్యాయం చేస్తే ఆ పార్టీలకు రాజకీయంగా బొంద పెట్టడం ఖాయమన్నారు. బీసీలను రాజకీయంగా అన్ని పార్టీలు పాలేరుగానే చూశాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో.. అర శాతం ఉన్న వెలమలకు 12సీట్లు, ఐదు శాతం ఉన్న రెడ్లకు 40 సీట్లు, 60శాతం ఉన్న బీసీలకు 23 సీట్లు చేటాయించడం దుర్మార్గమన్నారు. 130 బీసీ కులాలకు అదే విధంగా 50 శాతం ఉన్న బీసీ మహిళలకు అసలు అసెంబ్లీ టికెట్లు ఇవ్వకపోవడంతో అంటే బీఆర్ఎస్ పార్టీ బీసీలను మోసం చేసినట్లునని పేర్కొన్నారు. బీజేపీ పార్టీ నేటికీ బీసీల విషయంలో ఉలుకు పలుకు లేదని ఎద్దేవా చేశారు. బీసీ ఉద్యమాన్ని రాజకీయ అధికార ఉద్యమంగా మలుస్తామన్నారు. బీసీలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయి వరకు తీసుకు వస్తామన్నారు. బీసీలను చైతన్యం చేసేందుకు ఈనెల 10వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో స్టేడియంలో బీసీ సింహగర్జన పేరుతో భారీ బహిరంగసభను నిర్వహించనున్నట్లు తెలిపారు.అనంతరం బీసీ సింహగర్జన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు వంశీ ముదిరాజ్, వెంకట్, కాశన్న, నరేష్, బడేసాబ్, మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌గౌడ్, అనిల్, బాలరాజు, శివ, భరత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి

- ఆస్పత్రి ఎదుట బాధిత కుటుంబసభ్యుల ఆందోళన


షేక్ నజియా (ఫైల్)


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేష్

**శాంతినగర్:** వైద్యుల నిర్లక్ష్యంతో నిండుప్రాణం బలైన ఘటన వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు.. శాంతినగర్‌కు చెందిన షేక్ నజియా (26)కు కడుపునొప్పి రావడంతో ఆదివారం మధ్యాహ్నం స్థానిక బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించగా, వైద్యులు చికిత్స ప్రారంభించారు. అదేరోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో రక్త పరీక్షలు నిర్వహించి, ఆమె పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని.. మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు తీసుకెళ్లాలని బాధిత కుటుంబసభ్యులకు డాక్టర్లు సూచించారు. ఈ మేరకు కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నజియాను పరీక్షించిన డాక్టర్లు.. ఆమె చనిపోయి చాలాసేపయిందని కుటుంబసభ్యులకు తెలియజేశారు. స్థానిక ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే నజియా చనిపోయిందంటూ సోమవారం కుటుంబసభ్యులు, బంధువులు అంబేద్కర్ చౌరస్తా, ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే తన భార్య చనిపోయిందని హిజరత్‌భాషా ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నరేష్ ఆస్పత్రికి చేరుకొని మృతురాలి కుటుంబ సభ్యులకు సర్దిచెప్పి శాంతింపజేశారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ విషయమై ఆస్పత్రి యజమాని రవికుమార్‌ను వివరణ కోరగా, తమ తప్పిదమేమీ లేదన్నారు. తమ బాధ్యతగా చికిత్స అందించామని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు వెళ్లాలని సూచించామని వివరించారు.

# పశుమిత్రలకు వేతనాలు నిర్ణయించాలి


మాట్లాడుతున్న పశుమిత్రల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసు మాధవి

**మహబూబ్‌నగర్ న్యూటౌన్:** గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్న పశుమిత్రలకు వేతనాలు నిర్ణయించాలని పశుమిత్రల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసు మాధవి డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పశుమిత్రల సమావేశాన్ని సమరీన్ అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్రంలో దాదాపు 3 వేల మంది పశుమిత్రలు పనిచేస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లోని పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, తదితర మూగ జీవాలకు సేవలందిస్తున్నారని అన్నారు. ఎలాంటి వేతనం లేకుండా స్వచ్ఛంద సేవలు అందిస్తున్నారని, పశుమిత్రలకు వేతనాలు నిర్ణయించి తగిన గౌరవాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఐడెంటిటీ కార్డులు, డ్రస్సులు ఇవ్వాలన్నారు. పశుమిత్రల సేవలను గుర్తించి ప్రభుత్వం వెంటనే వేతనాలు నిర్ణయించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి హెచ్చరించారు. కార్యక్రమంలో పశుమిత్రల యూనియన్ నాయకులు చైతన్య, మంజుల, సమ్రీన్, రాజేశ్వరి, సంధ్య, లలిత, చిట్టెమ్మ, భువనేశ్వరి, సనీత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికే ముప్పు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్రకార్యదర్శి కూనమనేని సాంబశివరావు

**నాగర్‌కర్నూల్‌రూరల్:** జమిలి ఎన్నికలు ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నహాలు చేస్తోందని, అదే జరిగితే రాజ్యాంగంలోని ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదముందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు హెచ్చరించారు. సోమవారం ఉయ్యాలవాడ శివారులోని మాడ్రన్ కాలేజీ ఆవరణలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జమిలి ఎన్నికల ఆలోచన సరైంది కాదని, అది భారతదేశంలో సాధ్యం కాదన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పర్యాయం ఎన్నికలున్నప్పుడు శాసనసభ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలు ఒకే సారి జరగడానికి ఎలా సాధ్యమవుతుందని, ఇది సరైన నిర్ణయం కాదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీతో విభేదించామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీతో జాతీయ నాయకులు పొత్తు అంశం ఆలోచిస్తున్నారని, రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్‌తో కలుపుకొని వెళ్తే ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, దేశంలో బీజేపీలను ఓడించేందుకు అవసరమైన థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటుకు సన్నద్ధమవుతామని తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల్‌నర్సింహ, రాష్ట్రసమితి సభ్యులు కేశవులుగౌడ్, వెంకయ్య, జిల్లా నాయకులు ఏసయ్య పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఏఎస్‌ఐ మృతి

**ఆత్మకూర్:** రిటైర్డ్ ఏఎస్ఐ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్‌కు చెందిన గాళ్ల గాలెన్న (72) ఏఎస్ఐగా విధులు నిర్వర్తించి పదేళ్ల కిందట పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం దిగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కుమార్తె రమాదేవి ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం విధులు ముగించుకొని ఇంటికి చేరుకున్న రమాదేవి గాయాలతో అచేతన స్థితిలో పడి ఉన్న తండ్రిని చూసి చుట్టుపక్కల వారికి సమాచారం అందించి ఆస్పత్రికి తరలించింది. తలకు తీవ్రంగా గాయమైందని.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు రామరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

# రైతు సమస్యలపై రెండోదశ పోరాటం


మాట్లాడుతున్న ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ సాగర్

**అమరచింత:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై దేశంలోని అన్ని రైతు సంఘాలు ఏకమై రెండో దశ పోరాటం చేయాల్సిన తరుణం ఆసన్నమైందని ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ సాగర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎస్‌కేఎం జిల్లా సదస్సుకు ముఖ్యవక్తలుగా పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. 2021, డిసెంబర్ 9 ప్రధాని మోదీ లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీల ఆధారంగా ఢిల్లీని ఘెరావ్ చేసిన రైతు ఉద్యమం తాత్కాలికంగా విరమించుకుందన్నారు. దేశవ్యాప్తంగా రెండోదశ రైతు ఉద్యమం ప్రారంభించాలని సంయుక్త కిసాన్‌మోర్చా నిర్ణయించిందని వెల్లడించారు. జాతీయస్థాయి డిమాండ్లుగా కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టం, రైతుల రుణ విముక్తి, కార్పొరేట్ కంపెనీలకు కాకుండా రైతులకు లాభం కలిగించే పంట బీమా పథకం, రైతు ఉద్యమకారులపై కేసుల ఎత్తివేత డిమాండ్లతో దేశవ్యాప్త ఉద్యమం బలపడుతుందన్నారు. 2011 సాగుదారుల చట్టాన్ని అమలు చేసి కౌలు రైతులందరికి గుర్తింపు కార్డులు అందిస్తూ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ప్రస్తుత, గత సంవత్సరం తీవ్రంగా పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలన్నారు. సమగ్ర భూసర్వే చేపట్టి ధరణి లోపాలను సవరించాలని డిమాండ్ చేశారు. రైతు రుణాలతో పాటు పేరుకుపోయిన వడ్డీని మాఫీ చేయాలన్నారు. అక్టోబర్ నెలాఖరులోగా జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో అన్ని జిల్లాల్లో పాదయాత్రలు, వాహనయాత్రలతో క్షేత్రస్థాయిలో ప్రచార ఉద్యమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నవంబర్ 26, 27, 28 తేదీల్లో వేలాది మంది రైతులతో హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కృష్ణారెడ్డి, వెంకటయ్య, బాల్‌రెడ్డి, రాజన్న, రాబర్ట్, వెంకటేష్, ఆంజనేయులు, ప్రసాద్, ఎస్.రాజు పాల్గొన్నారు.